## కె.వి.వి. బ్రహ్మానందరావు

# బొమ్మ




"గుడ్ ఈవినింగ్ సార్ ! మీ రీవేళ ఆఫీసునుండి ఆలస్యంగా వచ్చారేం'' అంది ఉమ, గదితాళం తీస్తున్న నన్ను చూచి.

ఉమ మాటకు చిన్నగా నవ్వి "ఒకరి క్రింద పనిచేసేటప్పుడు టైమ్ అంటూ పెట్టుకుంటే ఎలా?'' అన్నాను.

"భలే చిత్రంగా మాట్లాడుతారు మీరు. ఎంత ఒకరి చేతిక్రింద పని చేసినా, ఆఫీసు అన్నాక టైమ్ అంటూ

లేకపోతే ఎలాగండి బాబు ... అన్నట్టు మీకు ఉత్తరాలు వచ్చాయి, తెస్తా నుండండి" అంటూ లోపలికి వెళ్ళింది.

గది తలుపు తెరిచి లోపలకు అడుగు పెట్టేసరికి ఉమ రెండు ఇన్‌లాండ్ కవర్లు, ఒక వారపత్రిక పట్టుకు వచ్చింది. వాటిని టేబిల్ మీద పెట్టి "పత్రికలో మీరు వేసిన బొమ్మ అచ్చ యిందండి. పోస్టుమన్ పుస్తకం చేతికి యివ్వగానే మీ బొమ్మ ఏదైనా అచ్చయి ఉంటుందని ఊహించి చూసాను, బొమ్మ బాగా వచ్చిందండి. ఐ లైకు వెరీమచ్" అంది.

"థాంక్యూ" అన్నాను.

ఉమ గది గుమ్మందగ్గర నిలబడి ఉంది. ఆమె వెడితే బాగుణ్ణు, చొక్కా విప్పి కాస్త ముఖం చేతులు కడుక్కో వచ్చు ననుకున్నాను. ఆడపిల్ల ముందు చొక్కా విప్పాలంటే అదోరకమైన సంకోచం. నా ఆలోచన గమనించినట్టు ఉమ "మీరు బట్టలు మార్చుకోండి. అయిదు నిమిషాలలో టీ పట్టుకొస్తాను" అంది.

"వద్దు–వద్దు నేను అలా బయటకు వెళ్ళి ఏకంగా భోజనంచేసి వస్తాను."

"ఫర్వాలేదులెండి. మీకోసం ప్రత్యే కంగా పెట్టడంలేదు. మీతోపాటు నేనూ త్రాగుతానంది. మరో మాటకు ఎదురు చూడకుండా లోపలకు వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళింతరువాత పుస్తకంలో అచ్చు అయిన నేను గీసిన బొమ్మను చూసు కుంటూ చాలాసేపు ఉండిపోయాను. గీసిన బొమ్మ అచ్చయితే చూసుకోవడం చాలా సరదా నాకు. అదొక వెర్రి ఆనందం–తృప్తి. యీ క్రేజి గొప్ప చిత్రకారుడికి ఉండకపోవచ్చుగాని అప్పుడే చిత్రలేఖనంలో ప్రవేశించిన నా బోటివాళ్ళకు అచ్చుఅయిన బొమ్మను, ఆ బొమ్మక్రింద పేరును చూసుకుని మురిసిపోవడం అదో ముచ్చట.

బట్టలు మార్చుకుని మిత్రులదగ్గర నుండి వచ్చిన ఉత్తరాలు చదివేసరికి ఉమ చేతిలో కప్పుతో గదిలోకి అడుగు పెట్టింది. ఆమె చేతిలోని కప్పు నందు కుని "శ్రమ తీసుకొన్నారు" అన్నాను.

నా మాటకు "శ్రమ ఏముందండి యిందులో. ఆడపిల్లను ఈమాత్రం పనిచేయలేనా ?" అంది అందంగా నవ్వుతూ.

టీ త్రాగుతూ "ఎవరూ లేరా ? ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. "

"లేరండి. మా నాన్నగారు గుడివాడ వెళ్ళారు."

"మరి మీ అమ్మగారు."

"గుడికి వెళ్ళారు."

"మరి మీరూ వెళ్లలేకపోయారా ?" అన్నాను.

"నాకు అప్పుడే భక్తి ఎందుకు సార్. యింకా మూడొంతుల బ్రతుకు ముందుంది" అంది. తల ఎత్తి చూసాను

ఆమె కళ్ళలో మెరుపు, ఆకర్షణ తలుక్కున మెరిసాయి. నేను టీ త్రాగిం తరువాత కప్పు తీసుకుని లోపలకు వెళ్ళి పోయింది ఉమ.

ఉమ మా యింటి ఓనరుగారి అమ్మాయి. అందమైనది. గుండ్రని కళ్ళు, సూదైన ముక్కు, సన్నటి పెద వులతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. మనిషిలోని మంచి, మర్యాద ఆమె మాటలలో ఎప్పుడూ తొంగిచూస్తుం టాయి. ఎప్పుడూ ఆత్మీయంగా మాట్లాడే ఉమ అంటే నాకు అభిమానం.

ఉమ తండ్రి మూర్తిగారు మూడేళ్ళ క్రితం డిప్యూటీ తహశీల్దారుగా రిటైర్ అయ్యారు. ఆయన సంతానం ముగ్గురు ఆడపిల్లల్లోను ఉమ ఆఖరుది. పెద్దవాళ్ళిద్దరకు ఆయన సర్వీసులో ఉండగా పెళ్ళిళ్లు చేయగలిగాడు. అదీ అతి కష్టంమీద. ఉద్యోగంలో ఆయన ఒక్క పైసా కూడా వెనక వేయలేక పోయాడు. ఉమ పెళ్ళికి ఎదిగేసరికి ఆయనకు నెల నెలా వచ్చే ఫింఛనూ, ఉండడానికి యిల్లూ తప్ప మరో ఆధారం, ఆసరా కనిపించలేదు. ఆయన చేసిందల్లా పెద్దకూతుళ్లను చదివించక పోయినా ఉమను ఇంటర్‌దాకా చదివిం చడం. ఆపైన చదివిస్తానని ఆయన గాని, చదువుతానని ఉమగాని అనలేదు. దానికి కారణం ఆ ఇంటి ఆర్థికపరిస్థితి. ఇప్పుడుమాత్రం ఆ కుటుంబంలో ఓ బాధ్యత ఉన్న తండ్రికి బరువుగా మిగిలింది ఉమ.

సంవత్సరంక్రితం బచ్చుపేటలో ఉన్న వారి ఇంటిలో ఖాళీగా ఉన్న గదిలో అద్దెకు దిగాను. వాళ్ళ యింట్లో దిగిన రెండువారాలకే నేను వాళ్ళింట్లో ఒక మనిషిగా మారిపోయాను. దానికి కారణం మూర్తిగారు. మూర్తిగారికి చదరంగం పిచ్చి. మంచి ఆటగాడు. ఆయన ఆటలోగాని పడితే అన్నం కూడా మరిచిపోతారు. నేను ఎప్పుడు కొంచెం ఫ్రీగా కనిపించినా ఆయన 'రావూ ఒక ఎత్తు వేద్దామేమిటి ?' అంటుంటారు. సరే ! అంటే ఆట వెంట ఆట అలా ఆడుతూ ఉండవలసిందే ! మేము అలా ఆటలోగాని ఉంటే టిఫిన్‌లు, కాఫీలు అందిస్తూ ఉమ మాతోపాటు కూర్చుంటుంది మధ్య మధ్య ఇరుపక్షాలకు తనకు తోచిన సలహాలు యిస్తూ...

నేను హోటల్‌లో రెండు మెతుకులు తిని రూంకొచ్చేసరికి కాంపౌండులో మూర్తిగారు కనిపించారు. పడకకుర్చీలో కూర్చుని చేతులు రెండూ తలక్రింద పెట్టుకుని ఆకాశంకేసి చూస్తూ ఉన్నారు. చూపెక్కడో చుక్కలమీద స్థిరంగా నిలిచినట్టు చూపులో తదేకత. సాధారణంగా ఆయన ఎప్పుడోగాని అలా కనిపించరు, ఏదో తెగని ఆలోచన మనస్సులో ఉంటేతప్ప.

నా అడుగుల చప్పుడుకు తల ఎత్తి 'రావుజీ భోజనం అయ్యిందా ?' అని పలకరించారు.

ఆయన మాటకు 'అయ్యింది' అన్నట్టు తల ఊపాను.

కాళ్ళ దగ్గరున్న స్టూలు ప్రక్కకు లాగి 'కూర్చోవోయ్' అన్నారు.

కూర్చుంటూ 'మీరు ఊరు వెళ్ళారని ఉమగారు చెప్పారు. ఎప్పుడొచ్చారు ?' అన్నాను. నా ప్రశ్నకు ఆయన ముఖంలో స్పష్టమైన అలసట కనిపించింది. దానివెంట నిట్టూర్పు వినిపించింది. భుజంమీద తువ్వాలును సరిచేసుకుని 'వెళ్ళడం రావడం కూడా అయ్యింది. మా ఉమకు గుడివాడలో సంబంధం ఉందంటే చూద్దామని వెళ్ళాను. బి.కాం. ప్యాసై కోపరేటివ్ బ్యాంకులో క్లర్కుగా పనిచేస్తున్నాడు. మనిషి బాగానే ఉన్నాడు. మన ఉమకు కూడా అన్నివిధాల నచ్చుతాడనే నమ్మకం ఉంది. అయితే వాళ్ళకు కట్నాలమీద మోజు ఉన్నట్టుంది. దానికి కారణం చూచాయగా చెప్పారు. వాళ్లక్కో పెళ్ళి కావలసిన అమ్మాయి ఉందట. ఆ అమ్మాయిని కట్నంలేకుండా ఎవరైనా పెళ్ళిచేసుకుంటే ఈ అబ్బాయికి కట్నం తీసుకోరట. కాని... కట్నం పుచ్చుకోకుండా పెళ్ళి జరుగుతుందంటావా ? యివ్వడం, పుచ్చుకోవడం నేరమే అయినా కట్నం యివ్వకుండా ఆడపిల్ల పెళ్ళి జరగదు. పోనీ ఏదోరకంగా జరుగుతుందిలే అని కాలహరణచేయడానికి యిప్పటికే ఆలస్యమైంది. ఎదిగిన ఆడపిల్ల యింట్లో తిరుగుతుంటే చూడ్డానికి చాలా బాధగా ఉంటుంది" అన్నారాయన బాధగా.

''నిజమే సార్ కట్నం తీసుకోవడం నేరం అని తెలిసికూడా కట్నంకోసం ఆశించడం, అలా తీసుకోడానికి కుటుంబ కారణాలు చెప్పడం, ఈనాడు ప్రతివారికి అలవాటు అయిపోయింది. ప్రభుత్వం వరకట్నం నిషేధించి ఎంత గట్టిగా శాసనాలు చేసినా యిచ్చి-పుచ్చుకునే వారిద్దరిలో ఈ విషయం ఉన్నంత వరకు మరో మూడో మనిషికి తెలిసే అవకాశం లేదు. వరకట్న పిశాచానికి ఎందరి జీవితాలు బలి అవుతున్నాయో మనకు తెలియంది కాదు. నూటికి ఎవరో ఒకరిద్దరు ఆదర్శయువకులు ఉన్నంత మాత్రాన ఈ సమస్య పరిష్కారం కాదు. ఈనాడు కట్నాల ముసుగులో తండ్రులచాటున దాక్కుంటున్న యువకులలో మార్పురావాలి. మొత్తం యువతరం ప్రాతినిధ్యం వహించిననాడే ఈ సమస్య రూపుమాపబడుతుంది. అప్పుడే సమాజంలో సాంఘికంగా పరివర్తన వస్తుంది. ఆ మార్పు రావడానికి కొంత కాలం పడుతుంది. అంతదాకా ఈ బాధ తప్పదేమో'' అన్నాను...

నా మాటకు ఆయన 'నిజమే'

అన్నారు. అంతకుమించి ఆయన మాట్లాడలేదు. చూపును శూన్యంలో ముడివేసారు. మనసులోని తీవ్రమైన అలజడితో ఆయన సమస్యల ఊబిలో కూరుకుపోయిన మనిషిలా కనిపించారు. ఆయన ఆలోచన అంతా ఉమ పెళ్ళి గురించి. ఎదిగిన ఆడపిల్ల యింట్లో తిరుగుతుంటే కన్న తల్లిదండ్రులకు చాలా యిబ్బందిగా ఉంటుంది. కూతురికి యింకా పెళ్ళి చేయలేక పోయామని మనస్సులో బాధ కాలుస్తూనే ఉంటుంది. ఎవరో ఒక మనిషి చేతికి కూతురు బాధ్యత అప్పజెప్పేవరకూ గుండెలోని బరువు తగ్గదు. మధ్యతరగతి కుటుంబాలలో ఆడపిల్లలను కన్న తల్లి దండ్రులకు ఈ బాధ అంత సులువుగా తప్పేదికాదు !

అయినా మూర్తిగారు ఉమ గురించి అంతగా ఆలోచించవలసిన అవసరం లేదు. అందమైన ఉమ మనస్సు ఉన్నత మైంది ఏ మనిషితో జీవితం పంచు కున్నా అవతల మనిషిని సుఖపెట్టి తను సంతోషపడుతుంది. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడే ఆమె మాటలలో ఆత్మీయత జల్లు, అనురాగపు పొంగు కనిపిస్తాయి. ఆమెను పెళ్ళిచేసుకునే వాడు తప్పకుండా అదృష్టవంతుడే అయ్యుండాలి !

మూర్తిగారి దృష్టి ఆకాశంమీది నుంచి కదలలేదు. ఆయన ఆలోచనలలో ఆయనను వదిలి 'గుడ్‌నైట్' చెప్పి నా గదిలోకి వచ్చి పడుకున్నాను.

మరునాడు ఉదయం-నిద్రలేచి బాత్ రూంవైపు వెడుతుంటే వరండాలోఉన్న స్తంభానికి ఆనుకుని తలంటుపోసుకున్న జుట్టును చిక్కు తీసుకుంటుంది ఉమ. నుదుట ఎర్రని తిలకం. కాటుక దిద్దిన కళ్లు. తెల్లనిచీర- అదే రంగు బ్లౌజులో కడిగిన ముత్యంలా ఉంది. తడి ఆరని కురులవల్ల ఆమె బ్లౌజు వెనకభాగం చాలామట్టుకు తడిసిపోయింద.

నన్ను చూసి 'గుడ్‌మార్నింగ్ ... ఈ రోజు ఆలస్యంగా లేచినట్టున్నారు. రాత్రి నిద్రపట్టలేదా ?' అంది చనువుగా.

ఆమె మాటలకు నవ్వి 'నిద్రపట్టక పోవడంకాదు. కొంచెం అతిగా నిద్రపోయాను.'

'అదృష్టవంతులు' అంది. నవ్వుతూ..

ఆమెను దాటిపోతుండగా 'ఏమండీ' అని పిలిచింది నెమ్మదిగా.

ఎందుకు అన్నట్టు చూసాను. ఉమ అటు యిటు చూసి తలదించి, కాలి వ్రేళ్లతో నేలను రాస్తూ 'మరి ... మరి ... మీతో కొంచెం మాట్లాడాలి. సాయంత్రం అయిదున్నరకు లైబ్రరీ దగ్గరున్న పార్కుకు రాగలరా ?' అంది గబగబా.

ఆశ్చర్యపోయాను. విషయం ఏమిటో ఎందుకు పార్కుకు రమ్మంటుందో

ఆలోచిస్తుండగా 'వస్తారు కదూ' అంది నెమ్మదిగా. నేను ఏదో చెప్పబోయాను. అంతలో ఉమ తల్లి అటుగా రావడం—ఉమ మాట్లాడ వద్దని కళ్ళతో వారించడం ఒకేసారి జరిగాయి.

నేను మాట్లాడకుండా 'వస్తానని తల ఊపి ముందుకు నడిచాను. ఉమ పార్కుకు ఎందుకు రమ్మంది ? ఏ విషయం గురించి మాట్లాడాలందీ నాకు బోధపడలేదు. కాస్సేపు ఆలోచించాను. ఏ విషయం తట్టలేదు. సరే ! విషయం ఏమిటో సాయంత్రం తెలియనే తెలుస్తుంది కదా! అనుకున్నాను !

మంగినపూడిలో ఉన్న మా ఆఫీసు నుండి పార్కుదగ్గర బస్సు దిగేటప్పటికి ఉమ చెప్పిన టైమ్‌కన్నా అరగంట పైనే దాటింది. గబగబా పార్కువైపు నడిచాను. గేటుదగ్గర ఉమ నిలుచుని ఉంది. ఆమె అలా ఒంటరిగా నిలబడడం చూసి చాలామంది ఆమెను ఆకలిగా, ఆశగా చూస్తున్నారు. ఆడపిల్ల ఒంటరిగా రోడ్డుమీద ఎందుకు నిలబడిందో — ఎవరికోసం నిరీక్షిస్తుందో తెలుసు కోవాలనే కుతూహలం చాలామందికి ఉంటుంది. వాళ్ళ కుతూహలం ఒంటరి ఆడపిల్లను తప్పకుండా యిబ్బంది పెడుతుంది. అలా యిబ్బందిలో ఉన్న ఉమ నన్ను కొద్దిదూరంలో చూసి రిలీఫ్‌గా నవ్వింది.

నేను దగ్గరకు వచ్చింతరువాత 'అబ్బ-మీరు వచ్చారుకదా ! వస్తారో రారో అనే సస్పెన్సుతో చచ్చాను. పైగా యిక్కడ యిలా నుంచోడానికి భయంవేసింది. చూసారుగా ఒంటరిగా నిలబడ్డ ఆడపిల్లను మింగేయాలని ఎన్ని మృగాలు ఆకలిగా చూస్తున్నాయో! మరో పదినిమిషాలు చూసి మీరు రాక పోతే ఇంటికి వెళ్ళిపోదా మనుకుంటు న్నాను. ఇంతలో మీరు రానే వచ్చారు,' అంది తృప్తిగా ఊపిరి పీల్చి.

'క్షమించండి. మిమ్మల్ని యిబ్బంది పెట్టాను. ఆఫీసునుండి వేగంగా బయలు దేరినా బస్సు సమయానికి వచ్చింది కాదు. అనుకోకుండా ఆలస్యమైంది...' అన్నాను బాధగా.

'ఫర్వాలేదులెండి ... మీరు వచ్చా రుగా' అంది.

ఇద్దరం పార్కు లోపలకు నడిచాం. వొత్తుగా పెరిగిన పచ్చికమీద ఆమె సరసన నడవడం వింతగాను, క్రొత్తగానూ ఉంది. నాకేదో మనస్సులో భయం. ఎవరైనా చూస్తే ఏమనుకుంటారో ననే భీతి. పార్కులో కూర్చున్న చాలామంది కళ్ళు మామీదనే ఉన్నాయి. అందరికి దూరంగా వచ్చి ఒక మూలగా కూర్చున్నాం. ఎప్పుడో తడిపిన గడ్డి యింకా తడితడిగా ఉంది. మేము

కూర్చున్న చోట సున్నగా నుగు చెట్టు పువ్వులు గాలికి ఒక్కొ-క్క-టి రాలి గడ్డి మీద పడుతున్నాయి. పార్కు నాను కున్న లై బ్రరీలోనుండి మనుష్యుల మాటలు నెమ్మదిగా వినిపిస్తున్నాయి. ఉమ నా కెదురుగా మోకాళ్ళమీద తలఆన్చి చేతిలో గడ్డిని త్రెంచుతూ ఉండిపోయింది. గాలివాటుకు ఆమె ముఖంమీద ముంగురులు పడుతూ లేస్తు న్నాయి. వాటిని చేతితో మృదువుగా ప్రక్క-కు తీసుకుంటుంది. ఆమె అందమైన కళ్ళలో అపురూపమైన భావమేదో తొంగిచూడడానికి విశ్వప్రయత్నం చేస్తుంది.

కాస్సేపు పోయింతరువాత "ఏదో విషయం మాట్లాడాలని రమ్మన్నారు. మర్చిపోయారా ?" అన్నాను.

నా మాటకు ఉమ సన్నగా, చిన్నగా నవ్వింది. ఆ నవ్వు ఒక్క-క్షణం నీటి మీద తరగలా మెరిసింది. ఒక అంద మైన పువ్వు గాలికి కదిలినట్టయింది. గాలికి జారే పైటను సవరించుకుని "అబ్బే-అదేం లేదండి. ఎలా మొదలు పెట్టాలా అని ఆలోచిస్తున్నాను. అసలు విషయం చెప్పేముందు నే నొకటి అడుగుతాను. నేనంటే మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి" అంది.

ఆ ప్రశ్నకు తడబడ్డాను. తొట్రుబ పడ్డాన. ఉమవైపు చూసాను. ఉమ కళ్ళలోనూ ఆ ప్రశ్న కనిపించింది.

"అభిప్రాయం...అభిప్రాయం ఏముంది. మీరు మంచివారు – చదువుకున్నవారు. అందంగా ఉంటారు" అన్నాను.

"భలేవారండి బాబూ ! ఆ విషయం వినడానికి మిమ్మల్ని యింతదూరం తీసుకురావాలా ? నేనంటే మరో అభిప్రాయం మీకు లేదా?" అంది. అలా అంటున్నప్పుడు ఆమె ముఖం రాగ రంజితమైంది. ఆమె భావమేమిటో నాకు లీలగా అర్థమైంది. అయినా ఏం చెప్పాలో అర్థంకాలేదు. మౌనంగా ఉండిపోయాను.

"పోనీ మీరు చెప్పకపోతే ... మానే యండి. మీ గురించి నా అభిప్రాయం ఏమిటో చెప్పమంటారా" అంది. చెప్పమన్నట్టు తల ఊపాను. తలను కొంచెం దించి ఓరగా చూసి "మిమ్మల్ని జీవితంలో తోడుగా పొందిన ఆడపిల్ల అదృష్టవంతురాలు. ఆ అదృష్టం నాకుంది అనుకుంటాను,"అంది వేగంగా.

ఆ మాటకు ఉలిక్కి-పడ్డాను. యింత సూటిగా స్పష్టంగా ఆమె భావమేమిటో చెప్పేసరికి ఆశ్చర్యపోయాను. ఉమ అంటే నాకు అభిమానం ఉందిగాని నే నెప్పుడూ ఆ అభిమానానికి మరో అభిప్రాయం జోడించి చూడలేదు.దానికి కారణం నాకోసం ఎదురుతెన్నులు చూసే మామయ్య కూతురు ఎప్పుడూ హృదయంలో మెదలడమే!అసలు ఉమకు యిటువంటి అభిప్రాయం కలగడానికి

నేను ఎప్పుడూ ఆస్కారం యిచ్చినట్టు గుర్తులేదు. మరి యిప్పుడామె ఆలోచనకు నిర్ణయానికి ఏంచెప్పాలో అర్థం కాలేదు.

అర్థంకాక ఉండిపోయిన నన్ను "ఏమండీ ఈ ఆడపిల్ల యింత బరి తెగించి అడిగిందేమిటని కదూ ఆలోచిస్తున్నారు ?" అంది.

"ఛ-ఛ అదేంకాదు."

"మరైతే నేను మీకు తగినదానిని కాకపోవచ్చు. మీ ఉద్దేశ్యం, అభిప్రాయం మరోలా ఉన్నా నేను కాదనను. కాని మీరంటే నాకు అభిమానం-ఆదరణ. మీ పట్ల ఆత్మీయత గుండెలో పేరుకుపోయింది. నాకు తెలియకుండానే హృదయంలో మీకో స్థానం స్థిరంగా ఏర్పడిపోయింది. తెలుసుకునేటప్పటికి మీ తోటిదే జీవితమనిపించింది. అందుకనే ఈ చొరవ తీసుకొన్నాను. అదిగాక నాకు వేగంగా పెళ్ళిచేయాలని మా నాన్నగారు ఎంతో ఆరాటపడుతున్నారు. ఊరురా వరాన్వేషణలో తిరుగుతున్నారు. మనిషి విలువను, వ్యక్తిత్వాన్ని డబ్బుతో వెల కట్టే ఈ ప్రపంచంలో ఆడపిల్ల పెళ్ళి అంత సులువుగా జరగదు. ఆర్థికంగా అండలేని మా నాన్నగారు నాకు వరుడిని చూసి, ఆ వరుడు కోరే కోర్కెలు తీర్చి నాకీ కన్నె చెర విడిపిస్తారని ఆశలేదు. దానికి నేను బాధపడడంలేదు. కాని కూతురుకు పెళ్ళిచేయలేదని ఆయన పడే బాధ నేను చూడలేను. హాయిగా వచ్చే పింఛనుతో కృష్ణా, రామా అంటూ కాలం గడపవలసిన రోజుల్లో నేను ఎదిగి ఆయన శాంతి, సుఖం పెళ్ళిపేరుతో హరించేస్తున్నాను. ఆయనకు ఈ బాధ తప్పించాలని భగవంతుని వేడుకుంటుండగా మీరు కనిపించారు. మీ మీద ఆశలు పెంచుకున్నాను. అందుకే మొహమాటపడకుండా ఈ విషయం మీతో చెప్పాను. మరి మీ అభిప్రాయమేమిటో చెప్పండి" అంది పొడిగా.

"సారీ ఉమ" అన్నాను ఒక్కసారిగా.

నా మాటకు ఉమ వెలవెలబోయింది. క్షణంలో తేరుకుని "నాకు తెల్సండి. మీ మౌనం ముందే మీ మనస్సులోని మాటను పైకి చెప్పింది. నన్ను చేసుకోలేనంటారు – కాకపోతే నన్ను ఎప్పుడూ ఆ దృష్టితో చూడలేదంటారు. అంతేగా."

"నిజం ! మిమ్మల్ని ఎప్పుడూ నేను ఆ దృష్టితో చూడలేదు. మీరంటే నాకు యిష్టం. అభిమానం. అంతమాత్రాన ఆ యిష్టాన్ని, అభిమానాన్ని మరో రకంగా అన్వయించి చెప్పలేను."

బైదిబై మీకు చెప్పటం మరచిపోయాను. నాకోసం మా మావయ్య కూతురు సిద్ధంగా ఉంది. ఆమెను నేను డిజప్పాయింట్ చేయలేను. ఈ విషయం

మీకు చెప్పడానికి ఎప్పుడూ ఆస్కారం రాలేదు. మీ నాన్నగారితో ఒకసారి మాటల సందర్భంలో మా యింటి సంగతులతోపాటు నా పెళ్ళి విషయం చెప్పాను. మీకూ ఈ విషయం తెలుసుననుకున్నాను ... మిమ్మల్ని కష్టపెడితే క్షమించండి."...

"నో, నో ... యిందులో మీరు చేసింది ఏముంది. నేనే పొరపాటు పడ్డాను. పరిస్థితులు నన్ను తొందర పెట్టాయి. చెప్పకుంటే చేయి అందిస్తారని మనస్సు విప్పి మాట్లాడాను. దేనికైనా అదృష్టం ఉండాలిగదండి... పోనీలెండి... ఈ రోజన్నా మీ నోటి వెంట ఆ సంతోషవార్త విన్నాను. మై కంగ్రాట్స్ !" ఆ మాట అంటున్నప్పుడు ఉమ గొంతు గాద్గదికమైంది. ఆమె కళ్ళలో చెప్పరిల్లిన కన్నీటిని నేను చూడకూడదని కాబోలు తలను ప్రక్కకు త్రిప్పింది. ఆ పరిస్థితిలో ఆమెను చూస్తే హృదయం జాలితో నిండిపోయింది. అనవసరంగా ఒక ఆడపిల్లను యిబ్బందిపెట్టా ననిపించింది. మరేం మాటలు సాగలేదు. చీకటి మా చుట్టూ పరుచుకుంది. మౌనం యిద్దరినీ యిబ్బందిపెట్టింది.

పార్కు బయటకు వచ్చింతరువాత "నాకు బజారులో కొంచెం పని ఉంది. కృష్ణ కిషోర్ టాకీసు దగ్గర బస్సు ఎక్కుస్తాను యింటికి వెళ్ళిపొండి" అన్నాను.

ఉమ తల ఊపింది.

ఇద్దరం కృష్ణకిషోర్ వైపు నడిచాం.

మరునాడు ఆదివారం. ఉదయం నుండి వర్షం కుండపోతగా కురుస్తూనే ఉంది. వర్షంలో ఎక్కడకు వెళ్ళడానికీ మనస్కరించలేదు. పోనీ మూర్తిగారితో చదరంగం ఆడదామంటే ఆయనకు జ్వరం. ఏమీ తోచక ఎప్పుడో గీసిన కాన్వాసు బొమ్మ నొకదానిని పైకి తీసి స్టాండుకు బిగించాను. ఒకసారి మిత్రుడి యింట్లో రాధాకృష్ణుల చిత్రం చూసాను. అది నన్ను బాగా ఆకర్షించింది. ఆ చిత్రంలో ప్రేమికుల పారవశ్యం, ప్రణయం ఉంది. రాధామాధవులిద్దరూ ఒకరి కళ్ళలోకి ఒకరు ఆరాధనగా చూసుకుంటూ తన్మయత్వంలో తేలిపోతుంటారు. వారిని చూస్తున్న చెట్టుమీద ఉన్న గువ్వల జంట. ప్రక్కన ప్రశాంతంగా పారే నది. దూరాన కొండలు. పచ్చని పచ్చిక. దానిలో మెరిసే రంగు రంగుల పూలు. సరిగా వేయాలిగాని ఒక గొప్ప సుందర దృశ్యం తయారవుతుంది.

పట్టుదలగా కూర్చుని జాగ్రత్తగా రంగులు కలిపాను. కొన్నిగంటల అనంతరం బొమ్మ జీవకళతో ఉట్టిపడింది. బోర్డరు గీస్తుండగా ఉమ నా వెనుక నిలుచోవడం గమనించాను.




ఆమె ఎంతసేపటినుండి నిలుచుందో గాని అప్పుడే చూసాను. నా కంటికి మామూలుగానే కనిపించింది. నిన్న జరిగిన సంఘటన తాలూకు ఛాయలు ఏమాత్రం ఆమెలో కనిపించలేదు.

ఆమెవైపు తిరిగిన నాతో "బొమ్మ చాలా బాగుందండి. రియల్లీ యిటీజ్ మార్వలెస్. మీ చిత్రలేఖనంలోని ప్రావీణ్యత అంతా ఈ బొమ్మలో కనిపిస్తుంది!" అంది.

"నిజంగానా?"

"అబద్ధాలు చెప్పడం ఆడపిల్లలకు అలవాటుండదు. అందునా పెళ్ళిగాని పిల్ల అబద్ధం చెప్పడానికి అసలే సాహసించదు."

"ఎందుకనో?"

"అది అంతే ! మీకు చెప్పినా అర్థం కాదు. సరేగాని మీరు గీసిన బొమ్మ నా కిస్తారా ? ప్రేమకు – ప్రణయానికి రాధామాధవులు నిదర్శనం అంటారు. వాళ్ళెంత అదృష్టవంతులో జీవితంలో ఆశించింది అందుకుని పొందగలిగేరు. ప్రపంచంలో ప్రేమికులందరు రాధా మాధవులవుతే ఎంత బాగుండేది ! ఏమిటో మేన్ ప్రపోజస్, గాడ్ డిస్పోజస్ అని మనం అనుకునేవి అన్నీ జరుగుతాయా ? పోనీయండి, దటీజ్ ఎస్టర్‌డే ఎఫైర్ ... ఈ బొమ్మ నా కివ్వండి. యిన్నాళ్ళ మన పరిచయాన్ని శాశ్వతంగా కళ్ళముందు నిలుపుకుంటాను" అంది ఉద్వేగంగా.

ఉమ మాటలు నన్ను కలత పెట్టాయి. అమాయకంగా పాపం నామీద ఎన్ని ఆశలు పెట్టుకుంది ? ఎంతగా ఆరాధిస్తుంది. ఆ ఆరాధన వెనుక వేదనలో నలిగిన గుండె ఎంతగా స్పందిస్తుందో!! స్త్రీ మనస్సు పడింవంటే ... ఆ మనస్సులో నచ్చినవాడికి శాశ్వతంగా పీఠం వేసి కూర్చోబెడుతుంది. తను మనస్సు పడింది కానిరోజున మనస్సులో పడే బాధకు అంతు ఉండదు అనుకున్నాను.

నా మాటకోసం ఎదురుచూస్తున్న ఉమతో. "మీ కంతగా యిష్టం అయితే తీసుకోండి" అన్నాను.

ఉమ కళ్ళు తృప్తిగా మెరిసాయి. బోర్డరు గీసి 'విత్ బెస్ట్ విషస్' రావు అని బొమ్మక్రింద వ్రాసి ఆమె చేతికి అందించాను.

ఉమ 'థాంక్స్' చెప్పి లోపలకు తీసుకెళ్ళింది.

ఉమ వెళ్ళింతరువాత ఆమె గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను.

కొన్ని సంఘటనలు ఎప్పుడూ ఊహించనివి హఠాత్తుగా జరుగుతుంటాయి. అటువంటివి జరిగినప్పుడు మాత్రం మనిషికి ఊపిరి పీల్చుకోడానికి కూడా సమయం చిక్కదు. మరుసటిరోజు ఆఫీసుకు వచ్చేసరికి ప్రమోషన్‌మీద విజయవాడ బదిలీ చేసినట్టు తెలిసింది. ఉత్తర్వు ప్రకారం వెంటనే వెళ్ళి జాయిన్ కావాలి. బందరు వదిలిపోతుంటే మనస్సులో బాధ.

ఇంటికి వచ్చి ఈ విషయం ఉమతో చెప్పాను. ఉమ నమ్మలేనట్టు చూసింది. రెండుక్షణాలు పోయింతరువాత... "మీరు ఈ సమయంలో నానుండి దూరంగా వెళ్ళడమే మంచిది. ఎందుకంటే ఈ రోజు కాకపోయిన మరో రోజైనా ... మిమ్మల్ని మరిచిపోయి నాకు ఒక తోడు జీవితంలో యిష్టానికో, అయిష్టానికో సంపాదించాలి కదా ! అది మీరుంటే సాధ్యపడదు. ఎందుకంటే మిమ్మల్ని నేను మర్చిపోలేను కనుక...అది సరే ... మీ పెళ్ళికి శుభలేఖ పంపించండి. రాలేకపోయినా

అభినందనలు పంపుతాను. ఒకవేళ– ముందే నా పెళ్ళి జరిగితే! ఏమో జరుగు తుందంటారా ?... మీరు తప్పకుండా రావాలి యు మస్ట్ కమ్. పెళ్ళి పందిట్లో తల ఎత్తేది మీకోసం ... వెళ్ళిరండి. ఐ విష్ యు ఆల్ ది బెస్ట్" అంది.

జవాబు చెప్పడానికి నాకు మాటలు కరువయ్యాయి.

అంతలో అటుగా వచ్చిన మూర్తి గారు సంగతి విని" యిన్నాళ్ళూ మా యింట్లో ఒక మనిషిగా మసిలావు. యిప్పుడు నువ్వు వెళ్ళిపోతుంటే బాధగా ఉందోయ్ ... విజయవాడ వెళ్ళినా మమ్మల్ని మరిచిపోకు. అప్పుడప్పుడు రావడానికి ప్రయత్నించు. నువ్వు ఎప్పుడు రాకపోయినా ఉమ పెళ్ళికి మాత్రం తప్పకుండా రావాలి" అన్నా రాయన.

అలాగే నన్నట్టు తల ఊపాను. ఆ రాత్రే విజయవాడ బస్సు ఎక్కాను.

కాలం ఎవరికీ తెలియకుండా క్యాలెం డరులోని కొన్ని కాగితాలను తినేసింది. ఈ మధ్యలో మూర్తిగారి పేరన రెండు ఉత్తరాలు వ్రాసాను. ఒకదానికి సమా ధానం వ్రాసారు. ఆ తరువాత సంగ తులు తెలియలేదు. నేను విజయవాడ వచ్చిన మూడో నెల కనుకుంటా ఉమ పెళ్ళి అని శుభలేఖ వచ్చింది. ఆ సమ యంలో అర్జంటు పనిమీద హైద్రాబాద్ వెళ్ళవలసి వచ్చి పెళ్ళికి వెళ్ళలేక పోయాను. రాలేకపోయినందుకు మరోలా అనుకోవద్దని మూర్తిగారికి ఉత్తరం వ్రాసాను. అంతే ! ఆ తరువాత బందరు అక్కడ మనుష్యులు జ్ఞాప కాలలో యిమిడిపోయారు.

కాలం మరి కాస్త ముందుకు కదిలింది—

ఆఫీసులో పని చూస్తుండగా పోస్టు మేన్ పెద్ద కవరొకటి తెచ్చి యిచ్చాడు. అంత పెద్ద కవరు ఎక్కడినుండి వచ్చిందో చూడ్డానికి ప్రయత్నించాను గాని దానిమీద ఫ్రమ్ అడ్రసు లేదు. ఎవరు పంపారో ఏమై ఉంటుందో అని ఊహిస్తూ కవరు చింపి లోపల మతడ పెట్టి ఉన్న కాన్వాసు క్లాత్‌ను బయటకు తీసాను. ఆశ్చర్యం. అది ఒకనాడు ఉమ ముచ్చటపడి తీసుకున్న రాధా కృష్ణుల బొమ్మ. దానివెంట ముత్యాల లాంటి అక్షరాలతో పసుపుపచ్చ కాగితం కనిపించింది.

తీసి చదవడం ప్రారంభించాను.

"ప్రియమైన రావ్‌గారికి నమస్కారం.

చాలాకాలానికి మిమ్మల్ని ఉత్తరం ద్వారా పలకరించే భాగ్యం కలిగింది. అందుకు సంతోషంకన్నా విచారమే ఎక్కువగా ఉంది. మీరు నా పెళ్ళికి వస్తారనుకున్నాను కాని రాలేదు. నిజానికి మీరు రాకపోవడమే ఒకరకంగా మంచిదయ్యింది. నా దురదృష్టంకొలది

మా వారు వట్టి అనుమానం మనిషి. కనీసం నాలుగుగోడల మధ్య నవ్వినా సహించలేని మనస్తత్వం ఆయనది. అందువల్ల నేను కలలుగన్న జీవితం ఈనాడు కలలోకి కూడా రావడంలేదు. యిక యిప్పుడు జీవితంతో రాజీ... అది తప్ప మరో గత్యంతరం కనిపించడంలేదు... యిక అసలు విషయానికి వస్తే ... ఒకనాడు మీరు గీసిన రాధా కృష్ణుల బొమ్మను నాకు కావాలని ముచ్చటపడి తీసుకున్నాను. మీరు నాకిచ్చిన ఆ ఒక్క గుర్తు చూస్తుంటే జీవితంలో ఏం పోగొట్టుకున్నా పోగొట్టుకోలేదని భ్రాంతి కలిగేది.

ఏదో తృప్తి ఎద ఎదలో తొంగి చూసేది. అనుభవం వాస్తవానికన్నా తియ్యగా, ఊహకన్న మధురంగా ఉండేది. ఒకరోజు బొమ్మ క్రింద నున్న మీ పేరు చూసి ఆయన 'ఎవరీ రావు?' అని అడిగారు. మనమధ్య ఉన్న అనుబంధం దాచకుండా చెప్పాను. అప్పటి నుండి ఆయన కళ్ళలో నిప్పులు, అసూయ, ద్వేషం, నా నీడమీద నిఘా. నా మాటమీద అబద్ధాల అన్వయింపు ప్రారంభమైంది. క్షణ క్షణం సాధింపు ...అన్నీ భరించాను. అయినా ఆయన మనస్సు శాంతించలేదు. చివరకు ఏమన్నారో తెలుసా "ఈ బొమ్మ అయినా యింటిలోనుండి పోవాలట, లేకపోతే నేనైనా వెళ్ళిపోవాలట. యిదీ నా దురదృష్టం. ఆడదాన్నిగా పుట్టినందుకు ఆశ లుండడం తప్పంటారా ? ఎలాగూ నేను యింటికి వెళ్ళి మా నాన్నగారి గుండెలమీద కూర్చునే శక్తిలేదు. చావు అయినా బ్రతుకైనా ఈ పరిధిలో యిలా యిమిడిపోవడమే ? అందుకే నేను అపురూపంగా యిష్టపడ్డ ఈ బొమ్మను తిరిగి మీకు పంపిస్తున్నాను. నన్ను క్షమించండి - ఎప్పుడైనా మీ గుండెలో ఈ నిర్భాగ్యురాలు మెదిలితే ఒక్క కన్నీటిచుక్క రాల్చండి ! అదే మీరిచ్చే అపురూపమైన కానుక నాకు !

సెలవ్ అంటూ చెప్పలేని

మీ ఉమ.

ఉత్తరం చదివినంతర్వాత కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగాయి. ఆ కన్నీటిలో చేతిలోని బొమ్మ మసక మసకగా కనిపించింది.